సాక్షి
అనంతపురం
శనివారం, 2, మార్చి, 2024
I



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.12

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4. నరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం
37.6°/16.3°

జిల్లా అంతటా శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదు కాగా.. రాత్రిళ్లు స్వల్పంగా తగ్గాయి. వేకువజామున చలి వాతావరణం కనిపించింది.

ఊపిరి నిలిపిన ప్రభుత్వం

పునర్జన్మ ప్రసాదించారు



- ఈ వ్యక్తి పేరు మహమ్మద్ రఫి. అనంతపురం పాతూరులో గ్యాస్ షాపు నిర్వహిస్తున్నాడు. 2020 ప్రారంభంలోనే కోవిడ్ బారినపడ్డాడు. అప్పట్లో ప్రభుత్వం అనంతపురం సర్వజనాస్పత్రి, హిందూపురం జిల్లా ఆస్పత్రి, బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి, కిమ్స్ సవీరతో పాటు మరికొన్ని ఆస్పత్రుల్లో కోవిడ్ రోగులకు ఉచితంగా సేవలందించే ఏర్పాట్లు చేసింది. మహమ్మద్ రఫి ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా కిమ్స్ సవీరలో 14 రోజుల పాటు సేవలు పొంది ప్రాణాలతో బయటపడ్డాడు. విపత్తు సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఎప్పటికీ మర్చిపోలేమని మహమ్మద్ రఫి చెబుతున్నారు.

పాపకు ప్రాణభిక్ష పెట్టారు



- ఇక్కడ కనిపిస్తున్న దంపతులు బషీర్, షకీల. బషీర్ అనంతపురంలో అరటి పండ్ల వ్యాపారి. వీరికి మూడేళ్ల కుమార్తె ఫరీహ ఉంది. కోవిడ్ ప్రారంభ దశలో ఇంట్లో అందరూ జ్వరాల బారిన పడ్డారు. చిన్నారి ఫరీహకు కోవిడ్ నిర్ధారణ అయ్యింది. దీంతో తల్లీబిడ్డను అధికార యంత్రాంగం బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించింది. కోవిడ్ అనగానే మొదట్లో భయమేసిందని, ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కుటుంబ సభ్యుల్లా చూసుకుని సేవలందించారని బషీర్, షకీల దంపతులు తెలిపారు. పాప ప్రాణాలు నిలబడ్డాయంటే అది ప్రభుత్వం మంచి ఆస్పత్రిలో సేవలందించేలా చర్యలు తీసుకోవడం వల్లేనని చెబుతున్నారు.



కోవిడ్ నిర్ధారణ పరీక్షల్లో భాగంగా నమూనాలు సేకరిస్తున్న దృశ్యం (ఫైల్)

- కోవిడ్ విపత్తు వేళ.. ఆపన్న హస్తం
- సత్ఫలితాలిచ్చిన జగన్ సర్కారు చర్యలు
- మూడు దశల్లో జిల్లాలో 25 లక్షల మందికి సేవలు

అనంతపురం మెడికల్: ప్రపంచాన్ని వణికించిన మహమ్మారి కోవిడ్. నీరసం, జ్వరం, జలుబు, దగ్గు తదితర లక్షణాలతో మొదలై ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడి ప్రపంచవ్యాప్తంగా ఎంతో మందిని పొట్టన పెట్టుకుంది. అంతటి భయంకరమైన విపత్తును ఎదుర్కోవడంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలిచ్చాయి. వైద్య ఆరోగ్య, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ శాఖలతో పాటు సచివాలయ -వలంటీర్ వ్యవస్థ సహకారం తీసుకుని అనుమానాస్పద లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికీ వేగవంతంగా నిర్ధారణ పరీక్షలు చేయడం.. పాజిటివ్ వచ్చిన వారిని ప్రత్యేకంగా ఆస్పత్రులు, కోవిడ్ కేర్ సెంటర్లు, హోం ఐసోలేషన్‌లో ఉంచి వైద్య సేవలందించి కోలుకునేలా చేశారు. అవసరమైన చోట్ల ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటు చేసి తద్వారా రోగులకు ప్రాణవాయువు అందించారు. అంతేకాదు కోవిడ్ వైరస్ వ్యాప్తి నియంత్రణ కోసం లాక్‌డౌన్ విధించిన సమయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా వలంటీర్లు తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు కోవిడ్ వ్యాక్సినేషన్‌ను వేగవంతంగా పూర్తిచేయడంలోనూ ప్రభుత్వం సఫలీకృతమైంది. కోవిడ్ మూడు దశల్లో జిల్లాలో దాదాపు 25 లక్షల మందికి ప్రభుత్వం సేవలందించిందంటే ఏ స్థాయిలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందో చెప్పాల్సిన పనిలేదు.

కోవిడ్ నియంత్రణకు పటిష్ట చర్యలు

జిల్లాలో 2020 మార్చి నుంచి కోవిడ్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ఆరోగ్య, మునిసిపాలిటీ, రెవెన్యూ సిబ్బంది, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, జిల్లా యంత్రాంగం కోవిడ్ బాధితులకు వైద్య సేవలందించేలా చర్యలు తీసుకుంది. మూడు దశల్లో 25,47,582 మందికి కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయగా, అందులో 1,77,596 మందికి కోవిడ్ నిర్ధారణ అయ్యింది. 45,327 మంది ఆస్పత్రిలో, 64,200 మంది కోవిడ్ కేర్ సెంటర్లలో, 66,331 మంది హోం ఐసోలేషన్‌లో సేవలు పొందారు.

వారి సేవలు అమూల్యమైనవి

కోవిడ్ సమయంలో ఆరోగ్య, పోలీసు శాఖలు అత్యంత కీలకంగా వ్యవహరించాయి. వైరస్ వ్యాప్తి చెందకుండా మునిసిపల్, పంచాయతీ సిబ్బంది కోవిడ్ ప్రభావిత ప్రాంతాల్లో అహర్నిశలు శ్రమించారు. బాధితులకు వలంటీర్లు ఆప్తుల్లా సపర్యలు చేశారు. ప్రధానంగా అనంతపురం సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ, హిందూపురం ఆస్పత్రి, తదితర ఆస్పత్రుల్లో రోగులను వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓతో పాటు పారిశుధ్య కార్మికులు సైతం కంటిరెప్పలా చూసుకున్నారు. లాక్‌డౌన్‌ను పక్కాగా అమలు చేయడంలో 4వేల మందికిపైగా పోలీసు సిబ్బంది సేవలందించారు.

జిల్లాలో కోవిడ్ మొదలైంది	2020 మార్చి
కోవిడ్ మొదటి వేవ్	2020 మార్చి నుంచి 2021 ఫిబ్రవరి
రెండో వేవ్	2021 మార్చి నుంచి 2021 నవంబర్
మూడో వేవ్	2021 డిసెంబర్ నుంచి 2022 ఏప్రిల్
సేవలు పొందిన వారి సంఖ్య	25,47,582
పాజిటివ్ కేసులు	1,77,596
ఆస్పత్రిలో అడ్మిషన్ పొందిన వారి సంఖ్య	45,327
కోవిడ్ కేర్ సెంటర్లలో	64,200
హోం ఐసోలేషన్	66,331



అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్

కోవిడ్ సమయంలో 'సూపర్' సేవలు



రెండో వేవ్‌లో కరోనా బారినపడ్డా. ఆ సమయంలో కరోనా నిర్ధారణ కావడంతో అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యా. అక్కడ వైద్యులు, స్టాఫ్‌నర్సులు, సిబ్బంది మంచి సేవలందించారు. అధైర్య పడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. వారం రోజులకు పైగా అక్కడే మెరుగైన సేవలందించారు. ప్రైవేట్‌గా అటువంటి సేవలు పొందాలంటే చాలా ఖర్చు అయ్యేది. ప్రభుత్వం ఉచితంగా సేవలంచినందుకు ధన్యవాదాలు.

–గౌసియా, అనంతపురం

ప్రభుత్వ సేవలు మరువలేనివి



కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి. ఆ సమయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ మాలాంటి వారికి బాగా ఉపయోగపడింది. వలంటీర్లు ఎప్పటికప్పుడు వచ్చి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసేవారు. ఏమైనా జ్వరం వస్తే మందులు, తదితర వాటిని ఇంటి వద్దకే తెచ్చేవారు. మరీ ముఖ్యంగా మునిసిపల్ కార్మికులు మా వీధిలోని పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేవారు. కరోనా సమయంలో ప్రభుత్వ సేవలు మరువలేనివి.

– లక్ష్మీప్రసన్న, గృహిణి, అనంతపురం

న్యూస్‌రీల్

పౌష్టికాహార భద్రతకు పెద్దపీట

- కార్డుదారులకు రూ.11కే కిలో రాగిపిండి



రాగిపిండి ప్యాకెట్ అందజేస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో డీఎస్ఓ శోభారాణి

అనంతపురం అర్బన్: పౌష్టికాహార భద్రతకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని కలెక్టర్ గౌతమి తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం పేదలకు నాణ్యమైన రాగిపిండి అందజేస్తోందన్నారు. సోమవారం అనంతపురంలోని సూర్యానగర్‌లో కార్డుదారులకు రాగి పిండి ప్యాకెట్ అందించి పంపిణీ ప్రారంభించారు. ముందుగా కార్డుదారులతో కలెక్టర్ మాట్లాడారు. బియ్యం, సరుకులు సక్రమంగా ఇస్తున్నారా.. తూకాలు సరిగ్గా వేస్తున్నారా.. పంపిణీ క్రమంలో ఏవైనా ఇబ్బంది పెడుతున్నారా? అని అడిగారు. సరుకులు సక్రమంగా ఇవ్వకపోయినా, ఇచ్చే క్రమంలో ఎవరైనా ఇబ్బంది పెట్టినా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వం రూ.11కే కిలో రాగిపిండి అందజేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్ఓ) శోభారాణి, సీఎస్‌డీటీలు పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌పై రేపటి వరకు సామాజిక తనిఖీ

అనంతపురం అగ్రికల్చర్: రబీ ఈ-క్రాప్, ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తికావడంతో ఆర్బీకే వేదికగా ఈ నెల 3 వరకు సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ శుక్రవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రబీలో 56,621 మంది రైతులు 85,807 హెక్టార్లలో పంటలు వేసినట్లు ఈ-క్రాప్‌లో నమోదైందన్నారు. ఇందులో 55,469 మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నట్లు వెల్లడించారు. ఈ నెల 3 వరకు ఈ-క్రాప్ జాబితాలు ఆర్బీకేలో అందుబాటులో ఉంటాయన్నారు. అభ్యంతరాలు ఉంటే ఐదో తేదీలోపు తెలిపి సరిచేసుకోవాలన్నారు. ఎనిమిదో తేదీన తుది జాబితాలు ఆర్బీకేల్లో ప్రదర్శిస్తామన్నారు. భవిష్యత్తులో ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, ఎంఎస్‌పీ అమ్మకాలు తదితర ప్రభుత్వ ప్రయోజనాలకు ఇబ్బంది ఉండదని తెలిపారు.

పెన్‌స్టేట్ వర్సిటీతో జేఎన్‌టీయూ సంప్రదింపులు



పెన్ స్టేట్ వర్సిటీ ప్రతినిధి డాక్టర్ హమీద్ అన్సార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ శ్రీనివాసరావు

అనంతపురం: పెన్‌స్టేట్ యూనివర్సిటీ (యూఎస్ఏ)తో జేఎన్‌టీయూ అనంతపురం అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడానికి సంప్రదింపులు జరుగుతున్నాయి. ఈ మేరకు జేఎన్‌టీయూలో రెండు యూనివర్సిటీల ఉన్నతాధికారులు శుక్రవారం సమావేశమయ్యారు. జేఎన్‌టీయూ(ఏ) వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ డిగ్రీ ప్రోగ్రాం, పరిశోధన సహకారం, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ వంటి అంశాలపై చర్చించామన్నారు. కార్యక్రమంలో పెన్‌స్టేట్ వర్సిటీ ప్రతినిధులు డాక్టర్ హమీద్ అన్సార్, డాక్టర్ వెంకటరామన్, డాక్టర్ సాయిరామ్, డాక్టర్ టాడ్ క్లార్క్, టీపీ రెడ్డి, జేఎన్‌టీయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, ప్రొఫెసర్ సురేష్‌బాబు, ప్రొఫెసర్ వి.సుమలత, ఫారిన్ ఎఫైర్స్ డీన్ ప్రొఫెసర్ పి.సుజాత, ప్రొఫెసర్ ఎస్.విశాలి, ప్రొఫెసర్ బి.ఈశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణకాంతి, విభాగాధిపతులు ప్రొఫెసర్ భువనవిజయ, డాక్టర్ లలితకుమారి, పాలక మండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి, డాక్టర్ టి.నారాయణరెడ్డి, డాక్టర్ ఓం ప్రకాష్, డాక్టర్ దిలీప్‌కుమార్, అజిత పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యత

- జగనన్న విద్యాదీవెన పేద విద్యార్థులకు వరం
- తల్లుల ఖాతాల్లోకి రూ.29.08 కోట్లు జమ
- 40 వేల మంది విద్యార్థులకు లబ్ధి
- కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



జగనన్న విద్యాదీవెన మెగా చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం అర్బన్: విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించాలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలనే ఉద్దేశంతో జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం కృష్ణాజిల్లా పామర్రు వేదికగా జగనన్న విద్యాదీవెన పథకం కింద ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని కంప్యూటర్ బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లోకి జమ చేశారు. అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌గర్ రిజ్వాన్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి పాల్గొన్నారు. కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సీఎం జగన్ విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉన్నత విద్యను అభ్యసించే పేద విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకం గొప్ప వరమన్నారు. ఈ పథకం కింద 2023 అక్టోబరు - డిసెంబరు త్రైమాసికానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 40,006 మంది విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం రూ.29.08 కోట్లను 36,260 మంది తల్లుల ఖాతాల్లోకి జమ చేశారన్నారు.

పేదరికమే ప్రామాణికంగా పథకాలు

కుల, మతలాలకు అతీతంగా పేదరికం ప్రామాణికంగా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ పేర్కొన్నారు. జగనన్న విద్యాదీవెన పథకం కింద ప్రభుత్వం 2023 అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి సంబంధించి 7,104 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.4.69 కోట్లు, 1,635 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.1.15 కోట్లు, 19,968 మంది బీసీ విద్యార్థులకు రూ.13.94 కోట్లు, 4,987 మంది ఈబీసీ విద్యార్థులకు రూ.4.69 కోట్లు, 3,907 మంది ముస్లిం మైనారిటీ విద్యార్థులకు రూ.2.70 కోట్లు, 2,298 మంది కాపు విద్యార్థులకు రూ.1.84 కోట్లు, 107 మంది క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులకు రూ.7 లక్షలు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలైందన్నారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం విద్యాదీవెన మెగా చెక్కును ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ రసూల్, మైనారిటీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు అండ



పేదలు ఉన్నత విద్య అభ్యసించేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ వల్ల మాలాంటి పేద విద్యార్థుల చదువుకు భరోసా లభించింది. క్రమం తప్పకుండా ఏ త్రైమాసికం ఫీజును అదే త్రైమాసికంలో చెల్లిస్తున్నారు. మా కుటుంబంలో నాకు విద్యాదీవెన, మా తమ్మునికి అమ్మ ఒడి ద్వారా లబ్ధి చేకూరింది. పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న సీఎంకు కృతజ్ఞతలు.

– ఎస్.సరిత, బీఏ సెకండియర్, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, అనంతపురం

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



మా లాంటి పేద విద్యార్థులకు ఉన్నత విద్య భారం... దూరం కాకుండా విద్యాదీవెన ద్వారా తోడ్పాటు అందిస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు. ఐఐటీ, ఇంజినీరింగ్, డిగ్రీ, మెడిసిన్ చేస్తున్న పేద విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పిస్తుండడం గొప్ప విషయం. మా కుటుంబానికి రైతు భరోసా, వైఎస్సార్ పింఛను కానుక, మరికొన్ని పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోంది.

– ఎం.నందిని, బీఎస్సీ సెకండియర్, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, అనంతపురం

జేఎన్‌టీయూఏకు న్యాక్ 'ఏ'

- దరఖాస్తు చేసిన తొలిసారే గణనీయమైన గ్రేడింగ్
- 2029 వరకు న్యాక్ ఏ గ్రేడ్ వర్తించేలా ఉత్తర్వుల జారీ



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

అనంతపురం: సాంకేతిక విద్యలో రాయలసీమలోనే కల్పతరువుగా భాసిల్లుతున్న జేఎన్‌టీయూ అనంతపురం సిగలో మరో కలికితురాయి చేరింది. ప్రతిష్టాత్మక న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్)-ఏ గ్రేడ్ సాధించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు అందాయి. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం కళాశాలను 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి యూనివర్సిటీగా మార్పు చేశారు. అప్పటి నుంచి జేఎన్‌టీయూ(ఏ) అంచలంచెలుగా ఎదుగుతూ జాతీయ స్థాయిలో ఉత్తమ సాంకేతిక యూనివర్సిటీగా నిలిచింది. న్యాక్‌కు దరఖాస్తు చేసిన తొలి ప్రయత్నంలోనే ఏ గ్రేడ్ దక్కించుకుంది. 2029 ఫిబ్రవరి 28 వరకు న్యాక్ -ఏ గ్రేడ్ గుర్తింపు వర్తిస్తుంది.

చాలా ఆనందంగా ఉంది

జేఎన్‌టీయూ అనంతపురం న్యాక్ -ఏ గ్రేడ్ సాధించడం చాలా ఆనందంగా ఉందని వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం వీసీ కాన్ఫరెన్స్ హాలులో మీడియాతో మాట్లాడారు. న్యాక్ గ్రేడింగ్‌తోనే వర్సిటీకి పరిశోధన ప్రాజెక్టులు రావడానికి వీలు కలుగుతుందన్నారు. అతి తక్కువ పాయింట్లలోనే న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ రాలేదని భావిస్తున్నామన్నారు. లోటుపాట్లను అధిగమించి న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ రావడానికి కృషి చేస్తామన్నారు. సెల్ఫ్ స్టడీ రిపోర్ట్‌ను రూపకల్పన చేసిన రిజిస్ట్రార్ సి.శశిధర్, ఐక్యూఏసీ డైరెక్టర్ సుబ్బారెడ్డి, ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ న్యాక్ గ్రేడింగ్ రావడానికి విశేషంగా కృషి చేశారని ప్రశంసించారు. యూనివర్సిటీ పురోగతికి సహకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్ హేమచంద్రారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు ఈశ్వరరెడ్డి, పి.సుజాత, శోభాబిందు, పాలకమండలి సభ్యుడు ఎం.రామశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏ గ్రేడ్‌కు దోహదం చేసిందివే..

న్యాక్- ఏ గ్రేడ్ రావడానికి గల కారణాలను న్యాక్ పీర్ కమిటీ అధికారికంగా వెల్లడించింది. ప్రఖ్యాతి గాంచిన యూనివర్సిటీ కావడం, సింహభాగం పూర్వ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉండడం ప్రధానమైన అంశంగా గుర్తించారు. భవిష్యత్తులో మరిన్ని విభాగాలు అభివృద్ధి చెందడానికి జేఎన్‌టీయూ (ఏ)కు కావాల్సినంత స్థలం అందుబాటులో ఉంది.

- గడిచిన నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ అవసరాలకు దీటుగా విద్యా ప్రణాళిక రూపకల్పన చేశారు. కోర్సు పూర్తయితే తక్షణ ఉపాధి కల్పించే రీతిలో ప్రోగ్రామ్స్ ప్రవేశపెట్టారు. అకడమిక్ పురోగతి సాధించే దిశగా విద్యా ప్రణాళికలో అంశాలు చేర్చారు.
- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో రూ.100 కోట్లు వెచ్చించి యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పన చేపట్టారు.
- 2008లో ఏర్పడినప్పటికీ అతి తక్కువ కాలంలోనే 134 అనుబంధ కళాశాలలు, 5 కానిస్టిట్యూట్ కళాశాలలతో (క్యాంపస్ కళాశాల, ఓటీపీఆర్ఐ, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, పులివెందుల, కలికిరి కళాశాలలు) నాణ్యమైన విద్యను పెంపొందిస్తోంది. ఇంజినీరింగ్, సైన్సెస్, హ్యూమానిటీస్, కమ్యూనికేషన్ స్కిల్స్, స్కిల్ ఓరియంటెడ్ కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ సిస్టమ్స్ (మూక్స్), స్వయం ప్రోగ్రామ్‌ల ద్వారా ఆన్‌లైన్ విద్యను ఉచితంగా అందిస్తున్నారు.

పింఛన్ల పండుగ

అనంతపురం క్రైం: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ జిల్లాలో పండుగ వాతావరణంలో జరిగింది. శుక్రవారం తెల్లవారుజామునే వలంటీర్లు వచ్చి పింఛన్ సొమ్ము అందిస్తుండటంతో లబ్ధిదారులు సంబరపడిపోతున్నారు. పింఛన్ సొమ్ముతో బతుకు బండి సాఫీగా లాగుతున్నామని చెబుతున్నారు. జిల్లాలో 2,89,975 మందికి దాదాపు రూ.87 కోట్ల పింఛన్ సొమ్ము అందజేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి తెలిపారు. జిల్లాలో తొలిరోజే 80 శాతానికి పైగా లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేసినట్లు వెల్లడించారు.



అనంతపురంలో పెద్ద వన్నూరమ్మ, చిన్న వన్నూరమ్మకు వికలాంగుల పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నాగేశ్వరి



అనంతపురంలో లక్ష్మీనారాయణమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మహేంద్ర

సజావుగా ఇంటర్ పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు మొదటి సంవత్సర విద్యార్థులకు పరీక్ష జరిగింది. అనంతపురం నగరంలోని వివిధ కేంద్రాలను కలెక్టర్ గౌతమి పరిశీలించారు. కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఎస్ఎస్‌బీఎన్ జూనియర్ కళాశాలల్లో పరీక్షల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. 22,920 మంది విద్యార్థులకు గాను 22,311 మంది హాజరయ్యారు. 609 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2,135 మందికి గాను 2,034 మంది హాజరయ్యారు. 101 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ వెంకటరమణనాయక్ మూడు పరీక్షా కేంద్రాలను, డీఈసీ సభ్యులు నాలుగు పరీక్షా కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 8 కేంద్రాలను పరిశీలించారు. సిట్టింగ్ స్క్వాడ్ 2 కేంద్రాల్లో ఏర్పాటు చేశారు.





అనంతపురం పరీక్ష కేంద్రంలో రూం నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు, పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థులు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించండి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ వరలక్ష్మి

అనంతపురం ఎడ్యుకేషన్: ఈ రెండు నెలల పరీక్షల సమయంలో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి సూచించారు. నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ 2024 క్యాలెండర్‌ను శుక్రవారం ఆమె ఆవిష్కరించి, మాట్లాడారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భూక్యా జయరాంనాయక్, ప్రధానకార్యదర్శి కాశీ రవీంద్రబాబు, నాయకులు వెంకటరాముడు, వేణు, రాజునాయక్, శరత్‌పోమర్, శ్రీరాములు, రమేష్ నాయక్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుకు బ్రేక్ ఫెయిల్

గుత్తి రూరల్: ప్రయాణికులతో బయలదేరిన ఆర్టీసీ బస్సుకు బ్రేక్‌లు ఫెయిలయ్యాయి. అయితే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎలాంటి ప్రమాదమూ చోటు చేసుకోలేదు. వివరాలు... శుక్రవారం ఉదయం తాడిపత్రి నుంచి గుత్తికి ప్రయాణికులతో బయలుదేరిన ఆర్టీసీ బస్సు గుత్తి శివారులోకి చేరుకుంటుండగా బ్రేక్‌లు పనిచేయలేదు. అప్పటికే బస్టాండ్‌కు అరకిలోమీటరు దూరానికి బస్సు చేరుకుంది. ఓ వైపు రోడ్డుపై వాహనాల రాకపోకలకు తోడు, పాదచారుల సంచారం కూడా ఎక్కువగా ఉంది. ఆ సమయంలో డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ ముందు వెళుతున్న వాహనదారులను అప్రమత్తం చేశాడు. వారు బస్సుకు ముందు వెళుతూ బ్రేక్ ఫెయిల్ అయిన విషయాన్ని గట్టిగా చెబుతూ అప్రమత్తం చేయడంతో వాహనదారులు, పాదచారులు వెనువెంటనే పక్కకు తప్పుకున్నారు. ఈ క్రమంలోనే రెండు వందల మీటర్ల దూరానికి పైగా గేర్ల సాయంతో వేగాన్ని డ్రైవర్ నియంత్రిస్తూ రావడంతో చివరకు శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద బస్సు ఆగింది. చాకచక్యంగా వ్యవహరించి ఎలాంటి ప్రమాదానికి తావులేకుండా వ్యవహరించిన డ్రైవర్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

చిరుత దాడిలో దూడ మృతి



కళ్యాణదుర్గం రూరల్: చిరుత దాడిలో ఓ ఆవు దూడ మృతి చెందింది. వివరాలు... కళ్యాణదుర్గం మండలం చాపిరి గ్రామానికి చెందిన రైతు ధనుంజయ తన పొలంలో గురువారం రాత్రి మూడు ఆవులు, ఓ దూడను కట్టి ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో ఓ చిరుత అక్కడకు చేరుకుని దూడపై దాడి చేసింది. ఆ సమయంలో కుక్కలు అరవడంతో ధనుంజయ అప్రమత్తమై కేకలు వేయడంతో చిరుత పారిపోయింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన దూడ కాసేపటికి మృతి చెందింది.

నాడు దోపిడీ... నేడు రాబడి

- వారాంతపు సంతల నుంచి గణనీయంగా పెరిగిన ఆదాయం
- ఈ ఐదేళ్లలో సంతల ద్వారా రూ.6.90 కోట్లకు పైగా వసూళ్లు
- టీడీపీ ఐదేళ్ల హయాంలో కేవలం రూ.3.90 కోట్ల వసూళ్లు
- మార్కెట్ ఆదాయానికి భారీగా గండికొట్టిన గత టీడీపీ పాలకులు



అనంతపురం మార్కెట్ యార్డులో గత శనివారం జరిగిన జీవాల సంత

వారాంతపు (పశువులు, జీవాల)సంతల ద్వారా వచ్చిన ఆదాయం ఇలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో..		టీడీపీ హయాంలో....	
సంవత్సరం	వసూళ్లు	సంవత్సరం	వసూళ్లు
2019-20	రూ.1.55 కోట్లు	2014-15	రూ.92.81 లక్షలు
2020-21	రూ.70 లక్షలు	2015-16	రూ.65.43 లక్షలు
2021-22	రూ.1.45 కోట్లు	2016-17	రూ.48.87 లక్షలు
2022-23	రూ.1.40 కోట్లు	2017-18	రూ.47.83 లక్షలు
2023-24	రూ.1.80 కోట్లు	2018-19	రూ.1.35 కోట్లు
మొత్తం	రూ.6.90 కోట్లు	మొత్తం	రూ.3.90 కోట్లు

అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వ ఆదాయ వనరులే లక్ష్యంగా గత టీడీపీ పాలకులు యథేచ్ఛగా దోపిడీ సాగించారు. అవకాశమున్న ప్రతి చోటా అందిన కాడికి దోచేశారు. ఈ క్రమంలోనే అనంతపురం మార్కెట్ యార్డులోనూ అక్రమాలకు చోటిచ్చారు. మార్కెట్ ఫీజు వసూళ్లలో ప్రభుత్వ ఖజనాకు గణనీయంగా గండి కొట్టి సొంత జేబులు నింపుకున్నారు. రెండు రెళ్లు నాలుగు అన్నది ఎంత నిజమో... గత టీడీపీ పాలకుల దోపిడీ కూడా అంతే నిజమని రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

నేడు అభివృద్ధి దిశగా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధి దిశగా పయనిస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహకానికి తోడు స్థానిక పాలక వర్గం చేపట్టిన చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయి. ఓ వైపు కమీషన్లు, సూట్లు లేకుండా చీనీ మార్కెట్‌ను విస్తరించి రైతులకు ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టారు. మరోవైపు వారాంతంలో జరిగే పశువులు, జీవాల సంతలను పటిష్టం చేయడంతో ఆదాయం క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఈ మొత్తం ప్రక్రియలో ఎక్కడేగాని చేతి వాటానికి, ఫీజుల స్వాహాకు తావు లేకుండా చేశారు. వృథా ఖర్చులను అరికట్టి నిఘా పటిష్టం చేయడంతో అనంతపురం మార్కెట్ యార్డు ఆర్థిక పరిపుష్టి సాధిస్తోంది. ఇందుకు వారాంతపు సంతల ద్వారా వసూళ్లవుతున్న ఫీజులే ప్రత్యక్ష నిదర్శనం.

ఐదేళ్లలో రూ.6.90 కోట్ల వసూళ్లు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ప్రతి శనివారం గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత నిర్వహిస్తారు. అలాగే ఆదివారం ఆవులు, గేదెలు, ఎద్దుల సంత జరుగుతోంది. సంతల నిర్వహణకు ప్రస్తుత పాలక వర్గం కమిటీ చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్ పటిష్ట చర్యలు, నిఘా ఏర్పాటు చేశారు. యార్డు సిబ్బంది చేతివాటం ప్రదర్శించకుండా, పాలక వర్గ సభ్యుల ఇష్టారాజ్యానికి వీలులేకుండా సీసీ కెమెరాలు అమర్చడంతో మార్కెట్ కమిటీకి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకున్నారు. సెక్రటరీలు, సూపర్‌వైజర్లు, సిబ్బంది కూడా పాలక వర్గానికి సహకరించడంతో క్రమేణా వసూళ్లు పెరిగాయి. దీంతో జగన్ సర్కార్ ఏర్పాటైన ఈ ఐదేళ్లలో పశువులు, జీవాల సంతల ద్వారా ఏకంగా రూ.6.90 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. ఇందులో కోవిడ్ కారణంగా 2020–21లో ఏడు నెలల పాటు పశువుల సంత, ఆరు నెలల పాటు జీవాల సంతను పూర్తిగా బంద్ చేశారు. 2022–23లో ముద్దచర్మవ్యాధి ప్రబలిన కారణంగా నాలుగు నెలల పాటు పశువుల సంతను మూసేశారు. ఇలా దాదాపు ఏడాది పాటు ఆదాయం లేకున్నా గతంతో పోల్చుకుంటే రెట్టింపు స్థాయిలోనే వసూళ్లు ఉండడం గమనార్హం.

టీడీపీ హయాంలో ఆదాయానికి గండి

2014 నుంచి 2019 వరకు ఐదేళ్ల చంద్రబాబు హయాంలో అప్పటి టీడీపీ పాలకులు మార్కెట్ కమిటీ ఆదాయానికి భారీగా గండికొట్టినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. చైర్మన్లు, పాలక వర్గానికి అప్పటి సెక్రటరీలు, సూపర్‌వైజర్లు సహకరించడంతో స్వాహాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతూ వచ్చిందనే విమర్శలు వెల్లువెత్తాయి. అప్పటి ఐదేళ్ల కాలంలో పశువులు, జీవాల సంతల ద్వారా కేవలం రూ.3.90 కోట్లు మాత్రమే వసూళ్లు జరిగినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఇది టీడీపీ పాలక వర్గం చేతివాటానికి నిదర్శనమని పలువురు ఆరోపిస్తున్నారు. 2018లో ఏసీబీ దాడి తర్వాత చేతివాటం కొంత తగ్గడంతో చివరి ఏడాది ఆదాయం పెరిగినట్లు స్పష్టమవుతుంది. అప్పటికీ ఇప్పటికీ పశువులు, జీవాలపై కొంత పన్ను పెంచినా... ప్రస్తుత లెక్కలతో పోల్చుకుంటే టీడీపీ ఐదేళ్ల హయాంలో రూ.5.50 కోట్ల వరకూ వసూళ్లు కావాల్సి ఉందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. 'ముంజేతి కంకణానికి అద్దమెందుకు' అన్న చందంగా గత ఐదేళ్లలో టీడీపీ పాలకులు ఎంత మొత్తంలో జేబులు నింపుకున్నరనేది రికార్డులే స్పష్టం చేస్తున్నాయి.

ముగిసిన రాతి దూలం లాగుడు పోటీలు



దూలం లాగుతున్న వృషభాలు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడులో బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు శుక్రవారం ముగిసాయి. ఆరు, ఆరు పళ్లు, న్యూ కేటగిరి, సీనియర్ విభాగాల్లో జరిగిన పోటీల్లో కర్నూలు, వైఎస్సార్, నంద్యాల జిల్లాలకు చెందిన వృషభాలు పాల్గొన్నాయి. పోటీలు ముగిసిన అనంతరం జరిగిన కార్యక్రమంలో విజేతలకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్ యాదవ్, పురుషోత్తం యాదవ్ నగదు పురస్కారాలను అందజేశారు. అనంతరం దాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాణిక్య రంగనాథస్వామి ఆలయ ధర్మకర్త మాకం శ్రీకాంత్, కౌన్సిలర్లు వరదరాజులు, నరేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు బేడల వెంకట్రాముడు, రంగస్వామి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, షఫీ, రామరంగారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, ఇబ్రహీం, నరసింహులు, ప్రభాకర్, బలరాముడు, పెద్దనారాయణ పాల్గొన్నారు.

వీధికుక్క బీభత్సం

పుట్లూరు: మండలంలోని అరకటివేముల గ్రామంలో శుక్రవారం ఉదయం ఓ వీధికుక్క బీభత్సం సృష్టించింది. దారిన పోతున్న వారిని వెంటబడి కరిచింది. కుక్క దాడిలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో భయభ్రాంతులకు గురైన ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రాలేకపోయారు. గాయపడిన వారిలో అంకాళమ్మ, అంజినమ్మ, సౌజన్య, నాగమునెయ్య, వెంకట్రాముడు, లక్ష్మీదేవి తదితరులు ఉన్నారు. కుక్కల బారి నుంచి ప్రజలను కాపాడాలంటూ ఈ సందర్భంగా సచివాలయ అధికారులకు సీపీఐ మండల కార్యదర్శి పెద్దయ్య వినతి పత్రం అందజేశారు.

మూడిళ్లలో చోరీ



సత్యనారాయణ ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

గుంతకల్లు రూరల్: తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని దుండగులు చెలరేగారు. గుంతకల్లులోని మూడిళ్లలో చొరబడి విలువైన ఆభరణాలు, నగదు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని సత్యనారాయణపేటలో నివాసముంటున్న రామచంద్రరావు స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, వినాయక స్వామి మందిరాల్లో అర్చకుడిగా పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి కర్ణాటకలోని గౌరిబిదనూరులో ఉన్న తన అక్క ఇంటికి వెళ్లారు. గురువారం అర్ధరాత్రి తిరిగి ఇంటికి చేరుకున్నారు. అప్పటికే తాళం తీసి ఉండడం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించారు. బీరువాలో దాచిన ఆలయానికి సంబంధించిన రూ.2 లక్షల నగదు, 5 తులాల బంగారు నగలు, 3.5 కిలోల వెండి సామగ్రి, ఓ ల్యాప్‌టాప్‌ను అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. అలాగే బీటీ ఫక్కీరప్ప కాలనీకి చెందిన ఆర్మీ ఉద్యోగి షేక్ నూర్‌బాషా భార్య మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి మహారాష్ట్రలోని నాసిక్‌లో ఉన్న భర్త వద్దకెళ్లింది. తాళాన్ని బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు బీరువాలోని రూ.65 వేల నగదు, ఐదు తులాల బంగారు నగలు, ఇదే కాలనీలో నివాసముంటున్న బాబా ఫక్రుద్దీన్ ఇంట్లో చొరబడి రూ.40 వేల నగదు అపహరించుకెళ్లారు. తమ ఇళ్లలో జరిగిన దొంగతనాలపై బాధితులు కసాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలాలను పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు.

బంగారం నగల అపహరణ

తాడిపత్రి అర్బన్: తాళం వేసిన ఓ ఇంటికి దుండగులు కన్నం వేసి బంగారు నగలను అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని సంజీవనగర్ జీరో రోడ్డులో నివాసముంటున్న ఇమామ్‌బాషా డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి వైఎస్సార్ జిల్లా పులివెందుల సమీపంలోని నల్లపురెడ్డిపల్లికి వెళ్లాడు. గురువారం రాత్రి తిరిగి వచ్చారు. అప్పటికే ఇంటి తాళంబద్ధలుగొట్టి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ మురళీకృష్ణ, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. బీరువలోని 15 తులాల బంగారు నగలు కనిపించకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యాడికిలోని మూడు దుకాణాల్లో...

యాడికి: మండల కేంద్రంలోని కుంటలో ఉన్న మూడు దుకాణాల్లో చోరీ జరిగింది. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత శేఖర్ అనే వ్యక్తి నిర్వహిస్తున్న చిల్లర దుకాణం షెడ్డు పైకి ఎక్కి రేకును తొలగించి దుండగులు లోపలకు ప్రవేశించారు. రూ.5 వేల నగదు అపహరించారు. అలాగే జాఫర్‌కు చెందిన దుకాణంలో రూ.10వ వేలు విలువ చేసే సిగరెట్ బండిళ్లు, ఫక్రుద్దీన్‌కు చెందిన పాన్ సెంటర్‌లో సామగ్రిని అపహరించుకెళ్లారు. బాధితు ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

పరిశ్రమల అభివృద్ధే లక్ష్యం

అనంతపురం అర్బన్: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి.. తద్వారా ఉద్యోగ, ఉపాధి కల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలు చేస్తోందని కలెక్టర్ గౌతమి స్పష్టం చేశారు. ఇందులో భాగంగా పరిశ్రమల శాఖ చేపడుతున్న ఎంఎస్ఎంఈల సర్వేకు పారిశ్రామికవేత్తలు సహకరించాలని సూచించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఏపీ ఎంఎస్ఎంఈ వన్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తయారీ, సేవ, వాణిజ్యరంగంలో అన్ని ఎంఎస్ఎంఈలను సర్వే చేసి వాటిని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకొచ్చి ఏపీ ఎంఎస్ఎంఈ వన్ పోర్టల్‌కు అనుసంధానిస్తారన్నారు. తద్వారా ఎంఎస్ఎంఈల డేటా బేస్‌ను అభివృద్ధి చేస్తారని చెప్పారు. సర్వే ద్వారా రాష్ట్రంలోని అన్ని డేటా బేస్‌లను అభివృద్ధి చేయడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడానికి సులభంగా ఉంటుందన్నారు. రానున్న నాలుగేళ్లలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంఖ్యను రెట్టింపు చేయడంతో పాటు వ్యాపారాన్ని వృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైజింగ్ అండ్ యాక్సలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ (ర్యాంప్) పథకాన్ని అమలు చేస్తోందన్నారు. పరిశ్రమల శాఖ, ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా శుక్రవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తాయన్నారు. ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు కాని ఎంఎస్ఎంఈలను సర్వే ద్వారా గుర్తించి వారికి అవగాహన కల్పించే విధంగా శిక్షణ నిర్వహిస్తారన్నారు. ఎంఎస్ఎంఈలకు చేయూత ఇచ్చే విధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ర్యాంప్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం నాగరాజరావు, ఏడీ రాజశేఖర్ రెడ్డి, ఎల్‌డీఎం సత్యరాజ్, ప్యాప్సీ ప్రెసిడెంట్ శేషాంజనేయులు, ప్రతినిధి నాగరాజు, ఎస్ఆర్ డ్రిప్ పైప్ పరిశ్రమ యజమాని నాగేశ్వరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్ తదితరులు

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు కలెక్టర్ గౌతమి తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై సీఈఓ శుక్రవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న చర్యలపై సీఈఓకు ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు. ఓటరు జాబితాకు సంబంధించి వచ్చిన దరఖాస్తుల పరిష్కారం పూర్తికావచ్చిందన్నారు. ఎపిక్ కార్డులను ఓటర్లకు పోస్టల్ ద్వారా చేరవేస్తున్నామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన పూర్తయ్యిందన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు శిక్షణ పూర్తి చేశామన్నారు. వచ్చే వారంలో బీఎల్‌ఓలు, ఇతర సిబ్బందికి శిక్షణ నిర్వహిస్తామన్నారు. ఎన్నికలకు సంబంధించి జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు నోడల్ అధికారులను నియమించామన్నారు. సమావేశంలో ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, రాణీ సుస్మిత, వి.శ్రీనివాసులురెడ్డి, ఈఆర్ఓలు శిరీష, రాంభూపాల్‌రెడ్డి, కరుణకుమారి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవి కుమార్, ఎస్ఏ శామ్యూల్ బెంజిమన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

అనంతపురం: ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. డీఎస్పీలు, సీఐలు రహదారులపైకి చేరుకుని విజిబుల్ పోలీసింగ్, వాహనాల తనిఖీ కొనసాగించారు. జిల్లా సరిహద్దుల్లో కర్ణాటక నుంచి జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పలువురు పోలీసు అధికారులు గ్రామాల బాట పట్టి, అక్కడ నెలకొన్న తాజా పరిస్థితులపై అధ్యయనం చేశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామ సభలు ఏర్పాటు చేసి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. పోలింగ్ స్టేషన్లను సందర్శించి మౌలిక వసతులను పరిశీలించారు.

నేడు ఎస్కేయూ పాలక మండలి సమావేశం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పాలక మండలి సమావేశం శనివారం నిర్వహించనున్నారు. వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో పలు అంశాలను అజెండాలో చేర్చారు. గత వీసీ హయాంలో ఉద్యోగులపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేత, 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సీఏఎస్ పదోన్నతులు, అరియర్స్ చెల్లింపు, పీఎం –ఉష పథకం కింద రూ.20 కోట్ల నిధులకు అనుమతి మంజూరు తదితర అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం.

జాతీయ స్థాయి పోలీసు క్రీడల్లో సత్తా



దీప

అనంతపురం: మహారాష్ట్రలోని నాగపూర్ వేదికగా గత నెల 26 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు 72వ జాతీయ స్థాయి పోలీసు క్రీడలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రీడల్లో యోగా విభాగంలో వెండి పతకాన్ని అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ దీప సాధించారు. విశాఖపట్నం దిశ పోలీసు స్టేషన్ సీఐ కళ్యాణితో కలసి కానిస్టేబుల్ దీప రిథమిక పెయిర్ యోగాసనాల విభాగాల్లో పాల్గొన్నారు. విజేత దీపను అనంతపురం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు.

రేపు 'పల్స్ పోలియో'



మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ యుగంధర్ చిత్రంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ సుజాత

అనంతపురం మెడికల్: పోలియో రహిత ప్రపంచమే లక్ష్యంగా ఈ నెల మూడో తేదీన పల్స్‌పోలియో చేపడుతున్నట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ యుగంధర్ తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వారు పిలుపునిచ్చారు. శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. దేశంలో పోలియో లేకపోయినా... ప్రపంచ వ్యాప్తంగా ఈ మహమ్మారి ఉండకూడదని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, చుక్కల మందు వేసుకునేందుకు పల్స్ పోలియో కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. తొలి రోజు ఆదివారం జిల్లాలో ఏర్పాటు చేసిన 1,785 బూత్‌లలో పోలియో చుక్కల మందు అందిస్తారన్నారు. సోమ, మంగళ వారాల్లో (4, 5 తేదీల్లో) ఆశా వర్కర్లు, ఏఎస్ఎంలు ఇంటింటా సర్వే చేపట్టి పోలియో చుక్కలు వేసుకోని వారికి అందిస్తారన్నారు. జిల్లాలో 108 ప్రాంతాలను హైరిస్క్‌గా పరిగణించి అందులో 1,234 మంది పిల్లలకు పోలియో చుక్కల మందు పక్కాగా అందేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. 3,80,000 డోసుల వ్యాక్సిన్‌ను ఇప్పటికే వివిధ పీహెచ్‌సీలకు పంపామన్నారు. 2,79,980 మంది పిల్లలకు వ్యాక్సిన్ అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తల్లిదండ్రులు 0-5 ఏళ్లలోపు పిల్లలకు తొలి రోజే పోలియో చుక్కలు వేసుకునేలా చూసుకోవాలన్నారు.

పల్స్‌పోలియోపై నేడు ర్యాలీ

పల్స్ పోలియోపై ప్రజల్లో చైతన్య తేవడానికి శనివారం ఉదయం 8 గంటలకు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ సాగుతుందన్నారు. ఆదివారం అనంతపురం కోర్టు రోడ్డులోని నెహ్రూ స్కూల్‌లో పల్స్ పోలియో కార్యక్రమం లాంఛనంగా ప్రారంభిస్తామన్నారు.

చెరువు కట్ట వద్ద వ్యక్తి మృతదేహం



బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దాదాపు 55 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి శరీరంపై తెల్లని చొక్కా ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు బుక్కరాయసముద్రం పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా సీఐ కోరారు.

జార్ఖండ్‌లో అదృశ్యం... 'అనంత'లో ప్రత్యక్షం

- జీఆర్పీ, చైల్డ్‌లైన్ సిబ్బంది చొరవతో కుటుంబసభ్యులకు బాలుడి అప్పగింత



దారి తప్పొచ్చిన బాలుడు, కుటుంబసభ్యులతో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తదితరులు

అనంతపురం సిటీ: తప్పిపోయిన బాలుడు 16 రోజుల తర్వాత మళ్లీ తమ చెంతకు చేరడంతో ఆ కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. వివరాలు... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఖాదీరాం గోసే వయస్సు 17 ఏళ్లు. పుట్టుకతోనే మూగ, చెవిటి అయినా పదో తరగతి పూర్తి చేశాడు. గత నెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆ బాలుడు తప్పిపోయాడు. రైలెక్కి ధర్మవరానికి చేరుకున్నాడు. ఒంటరిగా ఉన్న బాలుడిని టీటీ చూసి సమాచారం అందించడంతో జీఆర్పీ పోలీసులు అధీనంలోకి తీసుకుని చైల్డ్‌లైన్–1098 డీసీపీఓ మహేష్, ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళికి అప్పగించారు. వారు అనంతపురానికి పిలుచుకొచ్చి చైల్డ్‌లైన్ జిల్లా కో–ఆర్డినేటర్ కృష్ణమాచారి, చైల్డ్‌లైన్ టీం ఇర్ఫాన్, నిర్మల, ఐసీడీఎస్ పీడీ డాక్టర్ బీఎన్ శ్రీదేవి నేతృత్వంలో సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ మేడా రామలక్ష్మి ఎదుట హాజరుపరిచారు. ఈ క్రమంలో ఆమె చొరవ తీసుకొని బాలుడికి బుక్కరాయసముద్రంలోని ఆర్డీటీ పాఠశాలలో వసతి కల్పించారు. అక్కడి ఉపాధ్యాయుల ద్వారా బాలుడి వివరాలు రాబట్టి, జార్ఖండ్‌లోని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఖాదీరాం గోసే అన్న జగన్నాథ్ గోసే, మేనమామ బృందావన్ గోల శుక్రవారం అనంతపురానికి వచ్చి సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, నోడల్ ఆఫీసర్ వనజాక్షి సమక్షంలో బాలుడిని అక్కున చేర్చుకున్నారు. తమ బిడ్డను చేరదీసి, సురక్షితంగా అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, సీడబ్ల్యూసీ సభ్యురాలు కామేశ్వరి, చైల్డ్‌లైన్ బృందం ఇర్ఫాన్, నిర్మల పాల్గొన్నారు.

క్లుప్తంగా

కంపోస్టు యార్డుపై నిఘా ఉంచాలి



కమిషనర్ మేఘస్వరూప్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం కార్పొరేషన్: కంపోస్టు యార్డులో ఏటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం అర్ధరాత్రి కంపోస్టు యార్డులో మంటలు చెలరేగిన విషయం విదితమే. శుక్రవారం కమిషనర్ మేఘస్వరూప్‌తో కలసి ఎమ్మెల్యే కంపోస్ట్ యార్డును పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను డంపింగ్ యార్డ్ వద్ద పని చేసే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులతో మాట్లాడారు. ఇక్కడ ఒకేసారి మంటలు చుట్టూ వ్యాపించడంపై అనుమానం వ్యక్తం చేశారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ.. బయటి వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని కమిషనర్ మేఘ స్వరూప్ సూచించారు. మంటలు అదుపులోకి వచ్చాయని, అయితే కింది భాగంలో అగ్ని కీలలు ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎక్కడా మంటలు చెలరేగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డంపింగ్ యార్డ్ వద్ద ఎలాంటి పరిస్థితి ఉన్నా తమకు సమాచారం అందించాలని ఎమ్మెల్యే అనంత, కమిషనర్ మేఘ స్వరూప్ సూచించారు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యం



హ్యాండ్ వాష్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మెప్మా పీడీ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యంగా హ్యాండ్ వాష్ యూనిట్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు మెప్మా పీడీ విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 35వ డివిజన్‌లోని నీరు ప్రగతి వనంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ వాష్ యూనిట్‌ను మెప్మా పీడీ ప్రారంభించారు. స్థానిక ప్రజలు హ్యాండ్ వాష్ యూనిట్‌ను వినియోగించుకుని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, సీఓ సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి



జేఎన్‌టీయూ అనంతపురం వీసీ శ్రీనివాసరావును సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం: ఉద్యోగం చేయడం కంటే పది మందికి ఉపాధి కల్పించే ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు అన్నారు. అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల 16వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యార్థులకు మాత్రమే ఉందన్నారు. సమయాన్ని వృథా చేయకుండా కెరీర్‌పై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఐఆర్ఎస్ రిటైర్డ్ అధికారి ఎం.నరసింహప్ప, అనంతలక్ష్మి ఛ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అనంత రాముడు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామమూర్తి, వైస్ చైర్మన్ ఎం.రమేష్ నాయుడు, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

35 కేంద్రాల్లో పోలియో చుక్కల పంపిణీ

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఈనెల 3వ తేదీన పిల్లలకు పోలియో చుక్కలు వేస్తామని డాక్టర్ సబిహా సుల్తానా తెలిపారు. శుక్రవారం వైద్య సిబ్బంది పల్స్ పోలియోపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ చేపట్టారు. డాక్టర్ మాట్లాడుతూ.. 0–5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. 0–5 సంవత్సరాల్లోపు పిల్లలు మండల వ్యాప్తంగా 4,581 మంది ఉన్నారన్నారు. బస్టాండ్, ఆలయాల వద్ద ప్రత్యేకంగా క్యాంపులు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

తలుపుతట్టి.. కానుక అందజేసి

కనగానపల్లి/ఆత్మకూరు: ఒకటో తేదీ వచ్చిందంటే చాలు పండుటాకులు, వికలాంగులు, వితంతవులు ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఎటువంటి ఎదురు చూపులు లేకుండా గ్రామాల్లోని వలంటీర్లు తెల్లవారుజామునే తలుపుతట్టి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రతి నెలా 48 వేల మందికి సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. నియోజకవర్గంలోని 1,550 మంది వలంటీర్లు విధులు నిర్వర్తిస్తుండగా.. ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వికలాంగులు, వితంతువులను ఆప్యాయంగా పలకరించి పథకాలతో పాటు పింఛన్ డబ్బు అందజేస్తున్నారు.

ఈ ఫోటోలో కనిపించే వృద్ధురాలి పేరు తిప్పమ్మ. ఆత్మకూరులోని ఓ చిన్న కొట్టంలో ఉంటోంది. ఈమె వయస్సు దాదాపు 85 ఏళ్లు ఉండొచ్చు. భర్త చనిపోయి చాలా సంవత్సరాలు అయ్యాయి. ఉన్న ఒక్క కూతురు పెళ్లి చేసుకుని భర్తతో ఉంటోంది. దిక్కులేని అనాథలా చిన్న కొట్టంలో జీవనం సాగిస్తోంది. గతంలో ఈమె నడవలేని పరిస్థితుల్లో ఉన్నా పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లి ఫింఛన్ తెచ్చుకునేది. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో 1వ తేదీ రాగానే వలంటీర్ ఉదయాన్నే తలుపుతట్టి మరీ పింఛన్ అందజేస్తున్నారు. తనను ఎవ్వరూ పట్టించుకోకపోయినా సీఎం జగన్ వలంటీర్ల ద్వారా సహాయం అందిస్తున్నారని చెబుతోంది. పింఛన్ రూపంలో వచ్చే రూ.3 వేలు తనకు ఆధారమని చెబుతోంది. ఈ డబ్బుతోనే జీవనం సాగిస్తున్నానని వృద్ధురాలు తెలిపింది.



ఈ ఫోటోలో కనిపిస్తున్న మహిళ పేరు కుమ్మరి రామలక్ష్మమ్మ. చిన్న వ్యాపారం చేసుకుంటూ ఆత్మకూరులోనే నివాసం ఉంటోంది. పుట్టుకతో పోలియో సోకడంతో రెండు కాళ్లు పని చేయవు. దీంతో వివాహం కూడా చేసుకోలేదు. ప్రతి నెలా 1వ తారీఖున వలంటీర్ భాస్కర్ ఇంటి వద్దకే వచ్చి రూ.5 వేల పింఛన్ (డీఎంహెచ్ఓ పింఛన్) అందజేస్తున్నాడు. తనలా నడవలేని వాళ్లకు జగనన్న ఎంతో సహాయం చేస్తూ అండగా నిలుస్తున్నారని రామలక్ష్మమ్మ చెబుతోంది. ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్ల ద్వారా మాలాంటి ఎంతో మందికి భరోసా లభిస్తోందని పేర్కొంది. పేదలకు పథకాలు అందాలంటే జగనన్న మళ్లీ సీఎం కావాలని తెలిపింది.



నడవలేని స్థితిలో ఉన్న కుమ్మరి రామలక్ష్మమ్మ నుంచి వివరాలు తెలుసుకుంటున్న వలంటీర్

జగనన్న బాగుండాలి

గత టీడీపీ పాలనలో పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయలేదు. ప్రొద్దున్నే పంచాయతీ ఆఫీసు వద్దకే వెళ్లే అధికారులు మధ్యాహ్నం వచ్చేవాళ్లు. కొంత మందికి పింఛన్ ఇచ్చి వెళ్లిపోయేవారు. ఇలా పింఛన్ కోసం వారం రోజుల పాటు తిరగాల్సి వచ్చేది. అయితే జగనన్న గెలిచాక పాలనలో మార్పులు వచ్చాయి. వలంటీర్, సచివాలయ వ్యవస్థతో ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయి. వలంటీర్లు పథకాలకు దరఖాస్తు చేయించి, పథకాలు అందేలా చూస్తున్నారు. ఈ రోజు మా వలంటీర్ పోతలయ్య తెల్లవారుజామున ఇంటి వద్దకు వచ్చి రూ.3 వేల పింఛన్ అందజేశాడు. సీఎం జగన్ పాలన చాలా బాగుంది.



కనగానపల్లిలో వేకువజామునే వృద్ధురాలు నరసమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పోతలయ్య

ఇంటి వద్దకే పింఛన్

అనంతపురం కార్పొరేషన్: నడవలేని స్థితిలో ఉన్న మా అమ్మకు ప్రతి నెలా ఇంటి వద్దకే వచ్చి వలంటీర్ ద్వారక నాథ్ పింఛన్ అందిస్తున్నాడు. ఆ పింఛన్ మొత్తం ద్వారా అమ్మ బాగోగులు చూసుకుంటున్నాం. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.3 వేలు చేశారు. మాలాంటి పేద వారికి ఆ డబ్బు ఎంతగానో ఉపయోగపడుతుంది. గతంలో పింఛన్ కోసం ఆఫీసుల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సి వచ్చేది. అటువంటిది సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పింఛన్ అందించడం చాలా సంతోషంగా ఉంది. జగనన్న నూరేళ్లు చల్లగా ఉండాలి. మరోసారి ఆయనే సీఎంగా గెలవాలి. నడవలేని స్థితిలో ఉన్న వారి ఇంటి వద్దకే పింఛన్ అందించేలా జగనన్న చొరవ తీసుకోవడం హర్షణీయమని తెలిపింది.



వృద్ధురాలు ప్యారీ జాన్, చిత్రంలో ఆమె కూతురు రబియా

వలంటీర్ వ్యవస్థ భేష్

గతంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఆత్మకూరు మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఆఫీసుల చుట్టూ తిరిగి అలసిపోయే వాళ్లం. అయినా పని జరిగేది కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పథకాలన్నీ పారదర్శకంగా అందుతున్నాయి. మా వలంటీర్ మౌనిక ఇంటి వద్దకే వచ్చి పింఛన్ దరఖాస్తు చేయించింది. ప్రస్తుతం నాకు రూ.3 వేల పింఛన్ అందుతోంది. జగనన్న పేదల సంక్షేమానికి కృషి చేయడం సంతోషంగా ఉంది. ప్రతి నెలా 1వ తేదీ వస్తే చాలు ఉదయాన్నే తలుపుతట్టి మరీ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి.



రామాంజినమ్మకు పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్ మౌనిక

తొలి రోజు 16,752 పింఛన్ల పంపిణీ



లబ్ధిదారుడికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో శుక్రవారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ జోరుగా సాగింది. కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో వివిధ డివిజన్లలోని 74 సచివాలయాల పరిధిలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. మొత్తం 23,622 పింఛన్లు ఉండగా.. తొలి రోజు 16,752 మందికి రూ.5,05,58,000 పింఛన్ సొమ్ము అందజేశారు. పింఛన్ పంపిణీ 70.92 శాతం నమోదైంది. 37, 38వ డివిజన్లలో మేయర్ వసీం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక భద్రత కల్పించేలా పింఛన్ పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పింఛన్ అందిచేలా చర్యలు తీసుకుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాల మధ్య పింఛన్ పంపేవారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో కుల, మత, పార్టీలకు అతీతంగా పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అదే విధంగా వివిధ డివిజన్లలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, ఆయా డివిజన్ కార్పొరేటర్లు పింఛన్లు పంపిణీ చేశారు.

ప్రతి డివిజన్‌లో రూ.కోట్లతో సంక్షేమం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 26వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: గత టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి డివైడర్లకే పరిమితమైంది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో కేవలం రెండున్నరేళ్లలో ప్రతి డివిజన్‌లో కోట్లాది రూపాయలతో సంక్షేమం, అభివృద్ధి జరుగిందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 26వ డివిజన్ హమాలీ కాలనీలో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకందించిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు జరిగిన మేలును వివరించారు. నగరంలో నలుదిక్కులా అభివృద్ధి చేసి చూపామన్నారు. బళ్లారి బైపాస్ నుంచి పంగల్ రోడ్డు, రుద్రంపేట, రాజీవ్ కాలనీ, గుత్తి రోడ్డులో నూతన మార్గాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు కేటాయించిందన్నారు. సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లు, నగరపాలక సంస్థ సాధారణ నిధులతో 50 డివిజన్లలోని 74 సచివాలయాల పరిధిలో పెద్ద ఎత్తున రోడ్లు, కాలువలు, కమ్యూనిటీ హాళ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూ.2 వేల కోట్లకు పైగా సంక్షేమాన్ని అందించడం జరిగిందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, తదితర బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమైందన్నారు.

రుణమాఫీ పేరుతో టీడీపీ మోసం

గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని మోసం చేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలు మాఫీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాల ద్వారా మహిళా సాధికారత సాధించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రతి పథకంలోనూ మహిళలనే భాగస్వాములను చేశారని తెలిపారు. చేయూత ద్వారా అందించే డబ్బుతో చిరు వ్యాపారాలు చేసుకునే అవకాశాన్ని జగనన్న కల్పించారన్నారు. నగరంలో 23 వేల మందికి పైగా ఇంటి పట్టాలను అందించామని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు. మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకుందామన్నారు. అప్పుడే సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్రారెడ్డి, కార్పొరేటర్లు వి.మీనాక్షి, సంపంగి రామాంజనేయులు, ఇసాక్, బాలాంజినేయులు, డైరెక్టర్ శోభారాణి, క్లస్టర్ అధ్యక్షులు ఓబిరెడ్డి, పీవీ రమణారెడ్డి, మధు, జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖర్ రెడ్డి, చింతకుంట మధు, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైఫుల్లా బేగ్, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, నాయకులు నాగార్జున రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రామయ్య, వనారస బలరాం, రామకృష్ణ, సుజాత రెడ్డి, సుహాసిని, దేవి, శోభాబాయి, అలీఖాన్, వెంకటరెడ్డి, చెన్నారెడ్డి, వలి, షేక్షావలి, దేవమ్మ, రమీజా తదితరులు పాల్గొన్నారు.



హమాలీ కాలనీలో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

నేడు 26వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 26వ డివిజన్‌లో శనివారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హౌసింగ్ బోర్డులోని వేంకటేశ్వర స్వామి ఆర్చ్ నుంచి కార్యక్రమం మొదలవుతుందని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

పిల్లల సంరక్షణ మరిస్తే కేసుల నమోదు

అనంతపురం సిటీ: పిల్లల సంరక్షణ మరిచి, వారిని బడిలో కాకుండా పనికి పంపిస్తే తల్లిదండ్రులతో పాటు పనిలో పెట్టుకునే యజమానులపై కేసులు నమోదు చేస్తామని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి హెచ్చరించారు. 13 ఏళ్ల బాలుడిని తల్లిదండ్రులు పనిలో పెట్టడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం శివారులోని అన్నే ఫెర్రర్ కాలనీకి చెందిన ఓ కుటుంబం నగరంలోని ఆరో రోడ్డులో నివసిస్తోంది. వారికి ముగ్గురు పిల్లలు. పెద్ద కొడుకు వయస్సు 13 కాగా, మిగిలిన ఇద్దరు పిల్లల్లో ఒకరు 6, మరొకరు 5 ఏళ్లు. వారిలో ఒక చిన్నారి మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. కుటుంబ పోషణకు పెద్ద కుమారుడిని ఓ ఆటో మొబైల్ ఇంజినీరింగ్ వర్క్ షాపులో పనికి కుదిర్చారు.

అజ్ఞాత వ్యక్తి ఫోన్‌కాల్‌తో రంగంలోకి అధికారుల బృందం

పనిలో పెట్టుకున్న షాపు యజమానికి బాలుడితో శక్తికి మించిన పనులు చేయిస్తున్నట్లు ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ కాల్ చేసి సమాచారం అందించారు. దీంతో కార్మిక శాఖ సహాయ అధికారులు సుజాత, రాధా రమాదేవి, చైల్డ్‌లైన్ –1098 జిల్లా కో–ఆర్డినేటర్ కృష్ణమాచారి, ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, టీం సభ్యులు నిర్మల, ఇర్ఫాన్, మహిళా పోలీస్ శారద, వెల్ఫేర్ అసిస్టెంట్ చిరంజీవి సంయుక్తంగా కలసి రంగంలోకి దిగారు. బాలుడికి విముక్తి కల్పించారు. షాప్ యజమానితో పాటు బాలుడి తల్లిదండ్రులను పిలిపించారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సీడబ్ల్యూసీ సభ్యురాలు కామేశ్వరి ఎదుట హాజరుపరిచారు. తల్లిదండ్రులతో పాటు షాపు యజమానికి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలుడి కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్నాక ముగ్గురు పిల్లల సంరక్షణ బాధ్యతలు ఆర్డీటీ పెద్దలతో మాట్లాడి వారికి అప్పగిస్తామని అధికారులు తెలిపారు.



బాల కార్మికుడు, అతని తల్లితో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

అనంతపురం కల్చరల్: శ్రీశైలాన్ని తలపిస్తూ పదిరోజుల పాటు వేడుకగా జరిగే మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు నరసింహమూర్తి బృందం ధ్వజారోహణంతో ఉత్సవాలను శాస్త్రోక్తంగా ఆరంభించారు. మహాశివుడికి రుద్రాభిషేకం, భస్మార్చన జరిగాయి. రాత్రి పార్వతీ సమేత విశ్వేశ్వరుడు మయూర వాహనంపై పురవీధుల్లో విహరించాడు. మొదటి, రెండవ రోజుల మీదుగా వాహన సేవలకు భక్తులు హారతులు పట్టి నీరాజనాలర్పించారు. శయనోత్సవం అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది. ఆలయ ఈఓ రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయ కమిటీ సభ్యులు, ఆలయ ఈఓ , అనువంశీక ధర్మకర్తలు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. అలాగే జిల్లా జడ్జి శ్రీనివాస్ స్వామిని దర్శించుకుని పూజలు చేయించారు.



మయూర వాహనంపై దర్శనమిస్తున్న శివుడు



ఎమ్మెల్యే అనంతకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

సామాజిక స్పృహతోనే వృత్తిలో రాణింపు

అనంతపురం: సామాజిక స్పృహతోనే వృత్తిలో రాణిస్తారని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే.హుస్సేన్ రెడ్డి అన్నారు. విజయనగర లా కళాశాలలో శుక్రవారం న్యాయ విద్యార్థుల ఫ్రెషర్స్ డే లీగల్ గేట్‌వే కార్యక్రమాలు నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ.. అంకితభావంతో కృషి చేస్తేనే విజయం సొంతం అవుతుందన్నారు. న్యాయ విద్యార్థులు సమాజ సేవలో ముందు ఉండాలన్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్ రాఘవేంద్రచార్ అధ్యక్షత వహించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఆలూరి రామిరెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాద వృత్తిలో రాణించాలంటే విద్యార్థి దశ నుంచి సాధన అవసరమన్నారు. కళాశాలలో నమూనా కోర్టు, కేసుల వాదనలు, విచారణకు క్రమం తప్పకుండా హాజరుకావాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.మహేష్, అధ్యాపకులు హరికృష్ణ, ఆర్. కల్పన, నిర్మలా దేవి, రమ్య, శరత్ బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ హుస్సేన్ రెడ్డి

సప్లిమెంటరీకి అనుమతి ఇవ్వాలి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు, ఇయర్ వైజ్, సెమిస్టర్ వైజ్ విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షలకు అనుమతి ఇవ్వాలని వైఎస్సార్ ఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వీసీ ప్రొఫెసర్ హుస్సేన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కొన్ని వేలాది మంది విద్యార్థులకు ఒకటి, రెండు సబ్జెక్టులు మిగిలిపోయాయని, ఇంకొంతమంది కేవలం ప్రాక్టీకల్స్ మాత్రమే మిగిలిపోయాయని తెలిపారు. మానవతా దృక్పథంతో వీరికి డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు రాసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. దాదాపు 4 వేల మంది విద్యార్థులు ఉన్నారని, మెగా సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించాలన్నారు. వీసీ సానుకూలంగా స్పందిస్తూ వారందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ నాయకులు పి.హేమంత్ కుమార్, వాసు, చైతన్య, తిరుమలేష్, సురేష్ పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు

రాప్తాడు: ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే నైపుణ్యాలు పెంచుకోవాలని ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ సెల్ కన్వీనర్ డాక్టర్ నెల్లూరు కార్తికేయన్ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో ఎంట్రిప్రెన్యూర్ షిప్, ఇన్నోవేషన్‌తో కెరీర్ అవకాశాలు అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్తికేయన్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. సృజనాత్మకత ద్వారా సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులు రూపొందించవచ్చన్నారు. కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్. శర్మ, చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, ఎండీ వెన్నపూస రమాకాంత్ రెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ విజయ భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ సెల్ కన్వీనర్ కార్తికేయన్

రామలింగమయ్యకు జాషువా పురస్కారం



అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన ప్రముఖ గాయకుడు, పద్యకవి డాక్టర్ అంకె రామలింగమయ్య జాషువా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 3న హైదరాబాద్‌లో జరిగే పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నారు. ఆచార్య కొలకలూరి ఇనాక్‌తో పాటూ పలువురు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా కళాభూషణ్ అవార్డు అందజేస్తామని నిర్వాహకుడు డాక్టర్ పెద్దిటి యోహాన్ తెలిపారు.

డ్రై డే పాటించాలి

అనంతపురం మెడికల్: దోమకాటు నివారణ చర్యల్లో భాగంగా నగర ప్రజలు వారంలో ఒక రోజు డ్రై డే పాటించాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని జీసస్ నగర్‌లో జరుగుతున్న డ్రై డే కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. నీటి తొట్టిల్లో దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు ఉంచాలన్నారు. దోమకాటుకు గురి కాకుండా ఇంటిలో మస్కిటో కాయిల్స్, దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్లు నూరు బాష, శ్రీధర్‌మూర్తి, ఆరోగ్య కార్యదర్శి బోగాతి పద్మావతి పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

అనంతపురం టవర్‌క్లాక్: కురుబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కురుబ సంఘం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేంద్ర కోరారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు 30 లక్షల జనాభా ఉన్న కురుబలకు అన్యాయం జరుగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీలో రెండు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ స్థానాలు ఇవ్వడం జరిగిందన్నారు. టీడీపీలో కురుబలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, నార్పల కురుబ సంఘం అధ్యక్షుడు రాగే పరశురాం, నాగేంద్ర, ఓబుల పతి, లక్ష్మినారాయణ, దండువారిపల్లి ఆదినారాయణ, అక్కులప్ప, విశ్వనాథ్, వేణు, మురళి, రాగే యల్లప్ప, అంజి, కాటమయ్య, నరేష్, ఓబయ్య, జగదీష్, అక్కులపల్లి, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థిక అక్షరాస్యత అవసరం

అనంతపురం కల్చరల్: స్థానిక నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అవార్డు గ్రహీత నందిత రూపొందించిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు-24 పోస్టర్లను ఆవిష్కరించారు. ఎన్వైకే డీడీఓ శ్రీనివాసులు, జన శిక్షణ సంస్థ డైరెక్టర్ ఖాదర్ బాషా అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరిలోనూ ఆర్థిక అక్షరాస్యత అవసరమని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలచే గుర్తింపు పొందిన బ్యాంకులు, సంస్థల్లోనే పొదుపు డబ్బు దాచుకోవడం ఉత్తమమని సూచించారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం జాతీయ యువ కార్యకర్తలు కురుబ జయమారుతి, శ్రీకాంత్, దివ్యతేజ, రూబీఖాన్ పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

అనంతపురం ఎడ్యుకేషన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్థిక అవగాహన వారోత్సవాల్లో భాగంగా 'ఆర్థిక పదవినోదం' పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు అందజేశారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల వాణిజ్య విభాగం, నిర్వహణ శాస్త్ర విభాగం, కెనరా బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏసీఆర్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యతో పాటుగా ఇలాంటి పోటీల్లో పాల్గొనాలన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన ఆర్థిక అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఆర్థిక పదజాలం పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన విద్యార్థులను లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యరాజ్ అభినందించారు. మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు అందజేశారు. కన్సోలేషన్ బహుమతులిచ్చారు. వాణిజ్య, నిర్వహణ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి. రంగనాథ్, డాక్టర్ మల్లికార్జున, మురళీ మాధవ్ పాల్గొన్నారు.

మేధాశక్తి పెంపొందించుకోండి

అనంతపురం కార్పొరేషన్: విద్యార్థులు క్విజ్, డ్రాయింగ్, తదితర పోటీల్లో పాల్గొని, మేధాశక్తిని పెంపొందించుకోవాలని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని శ్రీ పొట్టి శ్రీరాములు స్కూల్‌లో రిజర్వ్ బ్యాంక్ సౌజన్యంతో ఫైనాన్సియల్ లైబ్రరీ వీక్‌లో భాగంగా విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు హెచ్ఎం ధర్మపూరి వెంకటేష్, కెనరా బ్యాంకు అధికారులు బహుమతులు అందజేశారు.



హెల్త్ టిప్స్



గుడ్డులోని తెల్లసొనను తినడం వల్ల అధిక రక్తపోటును నియంత్రించుకోవచ్చు. దీన్ని తినడం వల్ల అన్ని రకాల గుండె సమస్యలను దూరం చేస్తుంది. ఈ క్రమంలో మీరు రోజూ తినే ఆహారంలో గుడ్డును చేర్చుకోవచ్చు.



బాదం నూనెలో నిమ్మరసం కలిపి రాసుకుంటే చుండ్రు పోతుంది. ఒక గిన్నెలో కొద్దిగా బాదం నూనెను తీసుకొని.. అందులో కొద్దిగా నిమ్మ రసాన్ని మిక్స్ చేసి.. ఆ తర్వాత జుట్టుకు అప్లై చేయాలి. అలా కొద్దిసేపు చేతులతో తలపై మసాజ్ చేయాలి. మసాజ్ చేసిన తర్వాత అవసరమైతే.. గంట తర్వాత లేదా మరుసటి రోజు షాంపూతో మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల జుట్టు వేగంగా పెరుగుతుంది.



నిద్ర లేచిన తర్వాత మీకు మెడ నొప్పిగా అనిపిస్తే.. నొప్పి ప్రభావిత ప్రాంతాల్లో ఐస్ ప్యాక్ లేదే చల్లని నీటిలో నింపిన క్లాత్ ను వేసి అద్దాలి. అలా చేయడం వల్ల మెడ కండరాల వాపు తగ్గుతుంది. దీంతో పాటు హీట్ ప్యాక్ ను ఉపయోగించవచ్చు. ఇది కూడా మెడ కండరాల నొప్పిని తగ్గిస్తుంది.

మెడ నొప్పిగా ఉన్న వాళ్లు చేతులతో మెడను నెమ్మదిగా మసాజ్ చేయాలి. అలా చేయడం వల్ల కండరాలు సర్దుకొని నొప్పి తగ్గే అవకాశం ఉంది. మసాజ్ చేసే సమయంలో కొబ్బరి లేదా నువ్వుల నూనె ఉపయోగిస్తే మేలు జరుగుతోంది. మెడ నొప్పిని నివారించేందుకు మీరు రాత్రిళ్లు బోర్లా పడుకోకుండా ఉంటే చాలు.

మంచి అలవాట్లు
మెరుగైన ఆరోగ్యం

మంచి అలవాట్లు మన జీవితాలను మెరుగుపరుస్తాయి అని స్టీఫెన్ కోవీ తన '7 హ్యాబిట్స్ ఆఫ్ హైలీ ఎఫెక్టివ్ పీపుల్'లో చెప్పాడు. అదే సూత్రం ఆరోగ్యానికి కూడా వర్తిస్తుంది. ఆరోగ్యకరమైన అలవాట్లు జీవనశైలి మన ఆరోగ్యాన్ని, శక్తి స్థాయులని, పని చేసే సామర్థ్యాన్ని మెరుగుపరచడంతోపాటు జీవన శైలి వ్యాధులను నివారించడంలో కూడా తోడ్పడతాయి. ఇంతకీ ఆ అలవాట్లేమిటో తెలుసుకుందామా... ఎవరికైనా సరే, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే కొన్ని అలవాట్లు...

రోజును ముందుగానే ప్రారంభించటం...

తొందరగా నిద్ర లేవాలి, తొందరగా నిద్రపోవాలి అనే సూత్రాన్ని చాలామంది పాటిస్తుంటారు. అయితే ఈ సూత్రాన్ని పని చేసే రోజుల్లోనే అంటే వర్కింగ్ డేస్‌లో మాత్రమే పాటిస్తూ, సెలవ రోజుల్లో పక్కన పెట్టేస్తారు. అలా కాకుండా వారాంతాల్లోనూ, సెలవు రోజుల్లో కూడా సాధ్యమైనంత వరకు త్వరగా నిద్రలేచి త్వరగా మన దినచర్యను ప్రారంభించే అలవాటు స్వీయ క్రమశిక్షణకు చిహ్నం. అంతేకాదు, తొందరగా నిద్రలేవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండగలుగుతారని అనేక పరిశోధనల్లో రుజువైంది కూడా.

శుద్ధి చేసిన చక్కెరకు నో చెప్పండి

చక్కెరలో ఎటువంటి పోషకాలు లేవు. ఎందుకంటే ఇది ప్రాసెసింగ్ ద్వారా వెళుతుంది. ప్రాసెస్ చేసిన చక్కెరను అధికంగా తీసుకోవడం వల్ల మీ శరీరంలోని ముఖ్యమైన పోషకాలు క్షీణించడం ప్రారంభిస్తాయి. బదులుగా మినరల్ షుగర్, పామ్ షుగర్, బెల్లం లేదా తేనెకు మారడం మంచిది.

సముద్రపు ఉప్పుకు మారండి

చిప్స్, బర్గర్‌ల నుండి వేపుళ్ల వరకు ప్రతిదీ ఉప్పుతో నిండి ఉంటుంది. వాటిని చాలా రుచికరమైనదిగా చేస్తుంది. మీ ఆహారంలో ఎక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల రక్తపోటు, మూత్రపిండాల్లో రాళ్లు, డీహైడ్రేషన్, హైపర్‌టెన్షన్, కడుపు క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. అందువల్ల అయోడైజ్డ్ సాల్ట్‌కు బదులు సముద్రపు ఉప్పు, రాక్ సాల్ట్ లేదా హిమాలయన్ పింక్ సాల్ట్‌కి మారండి. ఇవి ఆరోగ్యకరమైనవి.

ఆరోగ్యకరమైన అల్పాహారం

అల్పాహారం తీసుకోవడం అనేది రోజులో అత్యంత ముఖ్యమైన విషయం.. మీకు ఉదయం సమయం లేకపోతే, ఏవైనా పండ్లు లేదా కొన్ని గింజలను అయినా తీసుకోవచ్చు. ఆ తర్వాత పనిలో తినగలిగే అల్పాహారాన్ని ప్యాక్ చేసుకుని తీసుకెళ్లి తినాలి. అంతేకానీ, మొత్తంగా బ్రేక్ ఫాస్ట్‌ను బ్రేక్ చేయద్దు.

కనీస వ్యాయామం

ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయలేరు. కానీ ఫిట్‌గా ఉండటానికి ట్రిక్ యాక్టివ్‌గా ఉండటమే. ఫిట్‌గా ఉండేందుకు రోజుకు పదివేల అడుగులు వేయడం సరైనదని పరిశోధనలు చెబుతున్నాయి. మన కదలికలు తగినంతగా లేకపోతే, మనలో చురుకుదనం లోపిస్తుంది. కొవ్వు పేరుకునిపోతుంది. అందువల్ల భోజనం చేసిన తర్వాత కొద్దిసేపు నడిచేందుకు ప్రయత్నించండి. అదేవిధంగా తక్కువ దూరాలను చేరుకునేందుకు వాహనాలను ఉపయోగించడానికి బదులు నడిచి వెళ్లే అలవాటు చేసుకోవడం మంచిది.

మంచి నిద్ర

శరీర సాధారణ పనితీరును, నాడీ వ్యవస్థను పునరుద్ధరించడానికి సహాయపడేవాటిలో నిద్ర కీలకమైనది.. నిద్ర లేకపోవడం వల్ల జీవనశైలిని నేరుగా ప్రభావితం చేసే మగత, అలసట, ఏకాగ్రత కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. నిద్ర లేమి మెదడుపై నియంత్రణను కోల్పోయేలా చేస్తుంది. అందువల్ల రోజూ కనీసం 6 నుంచి 8 గంటల నిద్ర పోవడం అవసరం. ఒక వేళ మీకు నిద్ర పట్టని సమస్య ఉంటే, ఏదైనా పుస్తకాన్ని చదవడం, చక్కటి సంగీతాన్ని వినడం, ధ్యానం చేయడం ద్వారా నిద్రపోయేందుకు ప్రయత్నించాలి. అప్పటికీ ఫలితం లేకపోతే వైద్య సహాయం తీసుకోవాలి.

నవ్వుతూ ఉండటం

మిమ్మల్ని మీరు పాజిటివ్ వైబ్స్‌తో నింపుకోవడానికి ఇదే సులభమైన పద్ధతి. నవ్వు లేని జీవితం శూన్యం. నవ్వు ఎండార్ఫిన్‌ల విడుదలను ప్రేరేపిస్తుంది. ఇది మానసిక స్థితిని పెంచుతుంది. ఒత్తిడి, ఆందోళన నిరాశను తగ్గిస్తుంది. అందుకే నవ్వండి, ఆరోగ్యంగా ఉండండి!

ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడం

రోజువారీ ఆహారంలో వివిధ రకాలైన పండ్లు, ఆకు కూరలు, మొలకలు, పప్పులు, మాంసం, పౌల్ట్రీ ఫుడ్, సీ ఫుడ్ ఉండాలి. మీ ఆహారంలో ప్రోటీన్లు, ఫైబర్లు, విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగానూ, కార్బోహైడ్రేట్లు, క్యాలరీలు తక్కువగానూ ఉండేలా చూసుకోవాలి.అలాగే, మీరు మీ ఆహారాన్ని ఎలా తింటారు లేదా నమలాలి అనేది కూడా ముఖ్యమైన భాగం. ఆహారం జీర్ణం కావాలంటే 20–30 సార్లు నమలాలి.

బాగా నీరు తాగడం

మన శరీరంలోని ప్రతి కణం, కణజాలం, ప్రతి అవయవానికి అవసరమైన మొత్తంలో నీరు తాగటం అవసరం. ఇతర పానీయాల కంటే తాగునీరు ఎల్లప్పుడూ మంచి ఎంపిక. హైడ్రేటెడ్ గా ఉండటానికి మీతో ఒక చిన్న వాటర్ బాటిల్ ఉంచుకోవడం అవసరం. ప్రతి అరగంటకు ఒకసారి కొన్ని గుక్కల నీరు తాగడం మంచిది.

టీ/కాఫీ తీసుకోవడం తగ్గించండి

పనిలో అనేక కప్పుల ప్రాసెస్ చేయబడిన కెఫిన్ తీసుకోవడం అనారోగ్యకరమైన అలవాట్లలో ఒకటి. మిల్క్ పౌడర్, పంచదార, పైగా ఉడికించిన టీ, రెడీ మిక్స్ కాఫీ, అన్నీ క్యాలరీలతో నిండి ఉన్నాయి. అందువల్ల పూర్తిగా మానేయనక్కర లేదు కానీ పరిమితంగా తీసుకోవడం మంచిది.

పరిశుభ్రత పాటించడం

నోటిని శుభ్రంగా ఉంచుకోవడం, క్రమం తప్పకుండా స్నానం చేయడం, ఇంటిని, వంటిని, పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి చిన్న అలవాట్లు ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా మీ సామాజిక జీవితాన్ని కూడా మెరుగుపరుస్తాయి.

వేసవి వచ్చేసింది... వేడితో అనేక సమస్యలు ఎదురవుతాయి. అన్నం తినాలనిపించదు. తినకపోతే ఆకలి. డీహైడ్రేషన్ సమస్యలు తప్పవు. అయితే వేసవిలో ముడిపడి ఉండే ఇటువంటి సమస్యలకు బార్లీనీళ్లతో చెక్ పెట్టొచ్చు. కేవలం వేసవి సమస్యలకే కాదు... అనేక ఆరోగ్య సమస్యలకు బార్లీ బాగా పని చేస్తుంది. అదెలాగో చూద్దాం...

పూర్వం ఎవరికైనా జ్వరం వచ్చిందంటే నీరసం నుంచి కోలుకోవడానికి బార్లీ నీళ్లు, సగ్గుజావ తాగించేవాళ్లు పెద్దలు. ఇప్పుడు కూడా బార్లీ కనిపిస్తోంది కానీ, అక్కడక్కడా... అప్పుడప్పుడూ మాత్రమే. కేవలం జ్వరంలోనే కాదు, వేసవిలో బార్లీ వాడకం చాలా మంచిది. అదెలాగో చూద్దాం...

బార్లీతో బోలెడన్ని సమస్యలు దూరం



➡ వేసవిలో తిన్నది అరగక పోవడం సాధారణ సమస్య. అలాంటప్పుడు బార్లీ నీళ్లు తాగితే చాలా మంచిది. జీర్ణాశయం కూడా చాలా శుభ్రపడుతుంది. అజీర్తి దూరమవుతుంది ➡ పిల్లలకు బార్లీ నీళ్లు తాగిస్తే మంచి ఫలితం ఉంటుంది. మలబద్ధకం వంటి సమస్యలు దరి చేరవు. ఎండల ప్రభావం పడకుండా ఉండాలన్న, వడదెబ్బ తగలకుండా ఉండాలన్న ఈ నీళ్లు తాగాల్సిందే ➡ మధుమేహులకు కూడా బార్లీ చాలా మేలు చేస్తుంది. రక్తంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. ఇన్సులిన్ కూడా అదుపులోనే ఉంటుంది ➡ ఇక గర్భిణులు రోజూ బార్లీనీళ్లు తాగితే మరీ మంచిది. కాళ్ల వాపు సమస్య వారి దరిచేరదు. రోజులో ఉదయం, సాయంత్రం బార్లీ నీళ్లు తాగితే బిడ్డ ఆరోగ్యం కూడా బాగుంటుంది. అలసట కూడా త్వరగా రాదు ➡ బరువు తగ్గాలనుకునే వారికి కూడా బార్లీ నీళ్లు బాగా ఉపయోగపడతాయి. రక్తంలో కొలెస్ట్రాల్ శాతాన్ని తగ్గిస్తాయి. దీని ద్వారా గుండె సంబంధిత వ్యాధులు దూరంగా ఉంటాయి. రక్తపోటును కూడా అదుపులో ఉంచుతాయి ➡ మహిళలను తరచూ బాధించే ప్రధాన సమస్య మూత్రనాళ ఇన్ఫెక్షన్. ఈ సమస్యను దూరం చేసుకోవాలంటే ఉదయాన రోజూ గ్లాసుడు బార్లీ నీళ్లు తాగితే మంచి ఫలితం ఉంటుంది. మూత్రంలో ఇన్ఫెక్షన్లు కలిగే కారకాలు, వ్యర్థాలు బయటికి పోతాయి. సూక్ష్మమైన రాళ్లు కూడా కరిగిపోతాయి.

సినిమా

ధ్రువ్‌కు జోడీగా..?


● అనుపమా పరమేశ్వరన్

తమిళ స్టార్ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్, హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ జోడీగా కనిపించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. ధ్రువ్ విక్రమ్ హీరోగా మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఓ స్పోర్ట్స్ డ్రామా తెరకెక్కనుంది. కబడ్డీ ప్లేయర్ మానతీ గణేశన్ జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుందనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు అనుపమా పరమేశ్వరన్‌ను తీసుకున్నారట. అనుపమాకి ఇటీవల మారి సెల్వరాజ్ ఈ కథను వినిపించగా, ఈ బ్యూటీ ఆల్మోస్ట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ టాక్. మరి.. ధ్రువ్ విక్రమ్‌కు జోడీగా అనుపమా పరమేశ్వరన్ కనిపిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇక ఈ సినిమా చిత్రీకరణ ఈ నెల 15న తమిళనాడులోని తూత్తుకూడిలో ప్రారంభం కానుందని సమాచారం.

జస్ట్ సూపర్ మేన్.. అంతే!

"కథ రాయడం మొదలుపెట్టి, తొలి డ్రాఫ్ట్ పూర్తి చేసేవరకూ నా సినిమాకు 'సూపర్‌మేన్: లెగసీ' అనే టైటిల్‌నే అనుకున్నాను. కానీ ఫైనల్ డ్రాఫ్ట్ పూర్తి చేశాక 'లెగసీ'ని వదిలేద్దామని నిర్ణయించుకున్నాను. ఇప్పుడు నా సినిమా టైటిల్ జస్ట్ 'సూపర్‌మేన్'... అంతే. మా ఈ సూపర్‌మేన్ వచ్చే ఏడాది జూలై 11న మీ ముందుకు వస్తాడు" అని సామాజిక మాధ్యమాల ద్వారా దర్శకుడు జేమ్స్ గన్ పేర్కొన్నారు. సూపర్‌మేన్ క్యారెక్టర్‌తో ఇప్పటివరకూ 'సూపర్‌మేన్' ఫ్రాంచైజీలను నిర్మించిన డీసీ స్టూడియోస్ తాజా సూపర్‌మేన్ చిత్రాన్ని నిర్మించనుంది. అయితే సూపర్‌మేన్‌ని కొత్త రకంగా చూపించనున్నారు జేమ్స్ గన్. ఇప్పటివరకూ వచ్చిన చిత్రాల్లో సూపర్‌మేన్ ధరించిన సూట్‌కి భిన్నంగా తాజా చిత్రంలోని సూపర్‌మేన్ సూట్ ఉంటుందట. కాగా ఈ మధ్యకాలంలో సూపర్‌మేన్ అంటే నటుడు హెన్రీ కవిల్ గుర్తొస్తారు. 2013 నుంచి 2021 వరకూ డీసీ స్టూడియోస్ నిర్మించిన సూపర్‌మేన్ చిత్రాల్లో టైటిల్ రోల్‌లో అద్భుతంగా ఒదిగిపోయారు హెన్రీ. కానీ, తాజా చిత్రంలో ఈ పాత్రను డేవిడ్ కోరెన్స్‌వెట్ చేయనున్నారు. "సూపర్‌మేన్ జీవితంలోని పూర్వ భాగంపై ఈ చిత్రం ఉంటుంది. ఈ పాత్రను హెన్రీ కవిల్ చేయలేదు. అందుకే డేవిడ్ కోరెన్స్‌వెట్‌ని తీసుకున్నాం" అని జేమ్స్ గన్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... ఇప్పటివరకూ మూడు నాలుగు చిత్రాల్లో మాత్రమే నటించిన 30 ఏళ్ల డేవిడ్ కోరెన్స్‌వెట్‌కి 'సూపర్‌మేన్' చాన్స్ రావడం అనేది గొప్ప విషయం అని హాలీవుడ్ అంటోంది.


● డేవిడ్ కోరెన్స్‌వెట్

కాశీలో క్లాప్


● తమన్నా, సంపత్ నంది

ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్టశక్తుల నుంచి ఏ విధంగా రక్షిస్తాడు? అనే ప్రధాన ఇతివృత్తంతో తెరకెక్కుతున్న క్రైమ్ థ్రిల్లర్ 'ఓదెల 2'. 2022లో డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదలైన 'ఓదెల రైల్వేస్టేషన్' సినిమాకు సీక్వెల్‌గా 'ఓదెల 2' తెరకెక్కుతోంది. ఇందులో తమన్నా భాటియా, హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ పై డి. మధు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు సంపత్ నంది క్రియేటర్‌గా ఉన్న ఈ సినిమా ప్రారంభోత్సవం కాశీలో జరిగింది. రెగ్యులర్ షూటింగ్‌ని కూడా కాశీలోనే ఆరంభించారు. తొలి సీన్‌కి సంపత్ నంది క్లాప్ కొట్టారు. "'ఓదెల 2' గ్రామం చుట్టూ కేంద్రీకృతమై, సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్ట శక్తుల నుండి ఎలా రక్షిస్తాడనే అంశాలతో ఈ చిత్రకథ ఉంటుంది. క్యాస్టింగ్, కథ, వీఎఫ్ఎక్స్.. టోటల్‌గా మేకింగ్ పరంగా ఈ చిత్రం పెద్దగా ఉంటుంది" అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: 'కాంతార' ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సౌందర్ రాజన్. ఎస్.

కొత్త పాయింట్‌తో తీశారనిపిస్తోంది
- రాజేంద్ర ప్రసాద్


● ఆయూషీ పటేల్, రాజేంద్ర ప్రసాద్, విశ్వ కార్తికేయ

విశ్వ కార్తికేయ, ఆయూషీ పటేల్ జంటగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో..'. రమాకాంత్ రెడ్డి దర్శకత్వంలో డా. కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి. మహేశ్వరరెడ్డి, కాటం రమేష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ– "కలియుగం పట్టణంలో..' టైటిల్ కొత్తగా ఉంది. కొత్త పాయింట్‌తో ఈ చిత్రం రాబోతోందని అర్థం అవుతోంది. నా 'ఆ నలుగురు' సినిమాలో అప్పడాలు అమ్మి పెట్టడంలో నా గురువుగా ఆరేళ్ల వయసులోనే విశ్వ కార్తికేయ నాతో పాటు నటించాడు. ఇప్పుడు హీరోగా నటించాడు. ప్రేక్షకులు ఈ సినిమాను పెద్ద సక్సెస్ చేయాలి. ప్రస్తుతం ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' సినిమాలో ఓ రోల్ చేస్తున్నాను" అన్నారు. "మదర్ సెంటిమెంట్, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌ను మిక్స్ చేసి ఈ సినిమా తీశారు. చిత్రా శుక్లా ఓ స్పెషల్ రోల్ చేశారు" అన్నారు విశ్వ కార్తికేయ. "మా చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుంది" అన్నారు రమాకాంత్ రెడ్డి. "మా టీజర్, ట్రైలర్‌ను చూసి కథను అంచనా వేయలేరు. సినిమా అంత కొత్తగా ఉంటుంది. ఈ సినిమా చిత్రీకరణను కడపలోనే చేశాం" అన్నారు కందుల చంద్ర ఓబుల్ రెడ్డి. "సినిమా అంతా కడపలోనే తీయడం ఇదే తొలిసారి. కడప నుంచి ఓ మంచి నిర్మాత రాబోతున్నాడు" అన్నారు దర్శకుడు నీలకంఠ.

ఎనిమిది భాషల్లో రికార్డు బ్రేక్


● కాశీ విశ్వనాథ్, చదలవాడ శ్రీనివాసరావు

నిహార్, నాగార్జున, రగ్గా ఇఫ్తాకర్, సత్యకృష్ణ, కాశీ విశ్వనాథ్ ముఖ్య తారలుగా చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వంలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలిమ్స్ పై చదలవాడ పద్మావతి నిర్మించిన చిత్రం 'రికార్డు బ్రేక్'. ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో 8 భాషల్లో విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'మళ్లీ పుట్టి వచ్చినవా..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. సాబు వర్గీస్ సంగీత సారథ్యంలో వరికుప్పల యాదగిరి ఈ పాటకు లిరిక్స్ అందించి, పాడారు. "అందరికీ నచ్చేలా మా సినిమా ఉంటుంది. ప్రేక్షకులందరికీ ఈ సినిమా కచ్చితంగా నచ్చుతుందని ఆశిస్తున్నాను" అన్నారు చదలవాడ శ్రీనివాసరావు.